ప్రజాశక్తి

బుధవారం 18 డిసెంబర్ 2024 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు

జిల్లా అభివృద్ధి కోసం
ప్రజాపోరాటాలు

- తక్షణం జిల్లాకు రూ.10 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి..
- 'వెలిగొండ'ను పూర్తి చేయాలి
- విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి
- జిల్లా మహాసభలోనూ ఈ అంశాలపై తీర్మానాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె.మాబు వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలని, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని, ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి చర్యలు చేపట్టాలని, విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని సిపిఎం జిల్లా నూతన కార్యదర్శి ఎస్కె.మాబు ప్రభుత్వాన్ని కోరారు. చీమకుర్తిలో జరిగిన పార్టీ 14వ జిల్లా మహాసభల్లోనూ వీటితోపాటు అనేక అంశాలపై తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు. మహాసభలు ముగిసిన నేపథ్యంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మంగళవారం నాడు స్థానిక సుందరయ్యభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి నిధులు, వెలిగొండ పూర్తి కోసం, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగానూ రానున్న కాలంలో ప్రజలను సమీకరించి ప్రజాపోరాటాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వెనుకబడిన ▶ 2లో

కారుమబ్బులతో కలవరం



ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్న చేస్తున్న రైతులు

- పొలాల్లో పరిచి ఉన్న వరి బోదెలు
- ఆరకుండానే కుప్పలు వేస్తున్న రైతులు
- అరకొరగా ధాన్యం కొనుగోళ్లు
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా కారుమబ్బులు కమ్మాయి. ఆకాశం మేఘా వృతమై వర్షపు జల్లులు పడుతున్నాయి. జిల్లా లోని వేమూరు, భట్టిప్రోలు, రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వరి పైరు కోతకు వచ్చి ఉంది. ఈ నెల మొదటి వారం నుంచి వరి కోతలు మొదలయ్యాయి. రెండు వారాలుగా రైతులు వరి కోతలు కోసేందుకు సంశయిస్తూ వచ్చా రు. ఈ నెలంతా వరుసగా బంగాళాఖాతంతో అల్పపీడనాలు ఏర్పడుతున్న క్రమంలో ఈ ప్రభావంతో ఎప్పుడు భారీవర్షాలు పడతాయే అన్న ఆందోళనతో రైతులున్నారు. వరి కోసి కుప్పలు వేసి నూర్చే పరిస్థితి లేకపోవడంతో వరి కోత యంత్రాలను రైతులు ఆశ్రయించి అప్పటికప్పుడు వరి నూర్పిడి చేపట్టి ఎంత ధర ఉంటే దానికే ధాన్యాన్ని తెగనమ్ముతున్నారు.

వరి కోతకు వచ్చినా గత కొద్ది రోజులుగా వర్షాల భయంతో అలానే ఉంచారు. కొందరు రైతులు వరి కోసి పొలంలోనే ఆరబెట్టారు. ఇప్పుడు కుప్పలు వేద్దామన్నా కుదరని పని. కుప్ప వేస్తే తేమ కారణంగా ధాన్యం మగ్గిపోతుంది. పొలంలోనే ఉంచితే అసలు చేతి కందే పరిస్థితి లేదు. ప్రభుత్వం కూడా పలు రకాల కారణాలతో ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపలేకపోతోంది.

జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 2.21లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో 151 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వం 75 కిలోల కామన్ రకం ధాన్యంకు రూ.1,725, గ్రేడ్ 'ఏ' రకం ధాన్యంకు రూ.1,740 చొప్పున మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు జరిపేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమైంది. ఈ ఖరీఫ్‌లో 50 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. కాగా ఇప్పటివరకు జిల్లాలో సుమారు 45 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నూర్పిళ్లు జరగ్గా ఇందులో పౌరసరఫరాల సంస్థ ద్వారా ఇప్పటివరకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు చెబుతున్నారు. 24 గంటల్లోనే రైతులకు నగదు జమవుతుంది. కానీ మిల్లర్లు సహకరించకపోవడం, తేమ శాతంలో తలెత్తుతున్న సమస్య, గోతాలు అందుబాటులో లేకపోవడం, మిల్లర్లు తాము కొనాల్సిన కోటా అయిపోయిందంటున్న నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇలాంటి కారణాలతో రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులకే అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో వ్యాపారులు 75 కిలోల ధాన్యాన్ని రూ.1,350 ధరపైనే కొనుగోళ్లు జరుపుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు, వ్యాపారులు కొంటున్న ధరకు చాలా వ్యత్యాసం ఉన్నప్పటికీ రైతులు తమ ధాన్యాన్ని తెగనమ్ముకోక తప్పడం లేదు. ప్రస్తుతం కోతకు వచ్చిన పైరుతో పాటు మరో లక్ష ఎకరాల్లో వరి కొద్దిరోజుల్లో కోతకు సిద్ధమయ్యే దశలో ఉంది. గత ▶ 2లో

తాకట్టులో దళిత కాలనీ

- 100 ఇళ్లలో 70 ఇళ్లు కుదువపెట్టి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ వద్ద రుణం..
- కిస్తీ డబ్బు కట్టలేదని మహిళను బయటకు లాగి.. ఓ ఇంటికి సీల్ వేసిన సిబ్బంది
- పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం

ప్రజాశక్తి-పంగులూరు

కుటుంబ అవసరాల కోసమో, గృహనిర్మాణం కోసమో పంగులూరు మండలంలోని బైటమంజులూరు దళిత కాలనీలో మెజారిటీ కుటుంబాలు ఇళ్లను ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థకు తాకట్టు పెట్టాయి. తొలుత అడిగి మరీ రుణాలిచ్చిన ఫైనాన్స్ సంస్థ సిబ్బంది రుణం తీసుకున్న దగ్గర నుంచి కిస్తీల కోసం రుణం తీసుకున్న వారిని వెంటాడారు. రుణానికి సంబంధించిన నెలవారీ కిస్తీ చెల్లించలేదని మంగళవారం నాడు దళిత కాలనీలోని ఓ ఇంట్లో మహిళను బయటకు లాగేసి.. ఇంటికి తాళం వేసి.. సీల్ వేశారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది దౌర్జన్యం చేశారు.

బైటమంజులూరు దళిత కాలనీలో సుమారు 100 ఇళ్లు ఉన్నాయి. ఇందులో 70 కుటుంబాల వారు అద్దంకిలోని ఐఐఎఫ్ఎల్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ వద్ద రుణాలు తీసుకున్నారు. ఒక్కొక్కళ్లు రూ.ఐదు లక్షల నుంచి ఆరు లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.13 వేల నుంచి 15 వేల రూపాయల వరకు కిస్తీలు చెల్లించాల్సి వస్తోంది. కేవలం కూలి మీదే ఆధారపడి జీవించే ఈ దళితులు ప్రైవేట్ ఫైనాన్స్ వాళ్లు చెప్పే మాయమాటలు నమ్మి లక్షలాది రూపాయలు అప్పు తీసుకున్నారు. ఇప్పుడు రుణాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సుజాత ఇంటికి తాళం వేసి.. సీల్ వేసిన ఐఐఎఫ్ఎల్ సిబ్బంది



బాధిత మహిళ సుజాత

దళిత మహిళను బయటకు లాగి..

బైటమంజులూరు గ్రామ దళితవాడకు చెందిన ఆలూరి సామ్యేలు (లేట్) భార్య సుజాత తన ఇంటిని తాకట్టు పెట్టి అద్దంకిలోని ఐఐఎఫ్ఎల్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ దగ్గర 2023 అక్టోబర్‌లో ఐదు లక్షల 50 వేల రూపాయలు ఇంటి రుణం తీసుకుంది. నెలవారీ కిస్తీగా 13,165 రూపాయలు చెల్లిస్తూ వచ్చారు. ఇంటిలో వచ్చిన ఆర్థిక ఇబ్బందుల వల్ల ఐదు నెలలకు చెల్లించాల్సి ఉంది. వారం రోజుల క్రితం రెండు నెలలకు సంబంధించిన డబ్బులను చెల్లించారు. ఇంకా మూడు నెలలకు సంబంధించిన డబ్బు చెల్లించాల్సి ఉంది. ఫైనాన్స్ సిబ్బంది ఆరుగురు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వచ్చి ఇంట్లో ఉన్న సుజాతను, ఆమె మనవళ్లను బయటకు లాగి తలుపు వేశారు. తాళంతో పాటు సీల్ వేసి వెళ్లారు.

రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కిస్తీ డబ్బులు చెల్లించలేదని ఫైనాన్స్ సంస్థ వాళ్లు తనను ఇంటిలో నుండి బయటకు లాగి తాళం వేశారని బాధితురాలు ఆలూరు సుజాత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంస్థ యాజమాన్యంపై, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

నీటి పంపిణీ సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

▶ 8లో



పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ

నేర సమీక్షలో ఎస్పి దామోదర్ ఆదేశం

8లో ▶

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి స్వామి

- రెవెన్యూ సదస్సులో ప్రతి అర్జీకీ రశీదు ఇస్తాం..
- మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం ఉదయం టంగుటూరు మండలం, వల్లూరు గ్రామంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి హాజరై.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ▶ 2లో

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

అమర్తలూరు మండలం, మోపర్రు గ్రామానికి చెందిన కొత్తపల్లి రాధాకృష్ణమూర్తి, వేమూరు మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన దాది శాంత కుమారిలకు మంగళవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కొత్తపల్లి రాధాకృష్ణమూర్తికి, రు.66,180, దాది శాంత కుమారికి రూ.59,287 మంజూరయ్యాయి.

సర్పంచ్, ఎంపిటిసిల గౌరవ వేతనం విడుదల చేయాలి

గ్రామ స్వరాజ్య సాధన సమితి అధ్యక్షులు వీరభద్రాచారి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిల గౌరవ వేతనం బకాయిలు తక్షణమే విడుదల చేసేలా పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని గామ స్వరాజ్య సాధన సమితి అధ్యక్షుడు జి.వీరభద్రాచారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిలు సుమారు సంవత్సరానికి పైగా గౌరవ వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీలు, మండల ఖాతాలకు జమ చేయడం ద్వారా ఆయా అధికారులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. వెంటనే గౌరవ వేతనం విడుదల చేసి వారి గౌరవాన్ని కాపాడాలని వీరభద్రాచారి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపిటిసి సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరావు, శాంతారావు పాల్గొన్నారు.

8 నుంచి ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రూడ్ సెట్ సంస్థలో ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు రూడ్‌సెట్ సంస్థలో జనవరి 8 నుంచి 30 రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామీణ ప్రాంతాలకూ చెంది ఉండి 19 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో భోజనం మరియు వసతి ఉచితంగా కల్పిస్తామని చెప్పారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8309915577, 9999675672 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లా అభివృద్ధి కోసం ప్రజాపోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాగా గుర్తించాలని సిపిఎం చాలా కాలంగా పలు రూపాల్లో పోరాటాలు నిర్వహించిందన్నారు. ఫలితంగా వెనుకబడిన జిల్లాగా గుర్తించినప్పటికీ నిధులు కేటాయించలేదన్నారు. తక్షణం జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయించి ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పెండింగు ప్రాజెక్టులు, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, రైల్వేలైన్లు, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించాలంటే తక్షణం నిధులు కేటాయించాలని కోరారు. కనిగిరి సెజ్, దొనకొండ పరిశ్రమల కారిడార్‌ను చేపట్టాలన్నారు. అప్పుడే ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విధానాల్లో ఏమాత్రం మార్పులేదన్నారు. ప్రజాసమస్యలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన తెలుగుదేశం నేతలు అధికారంలోకి రాగానే కోట్లాది రూపాయల భారాలు వేస్తున్నారన్నారు. స్మార్ట్‌మీటర్లపైనా ఇదే ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే రానున్నకాలంలో ప్రజలపై మోపే కోట్లాది రూపాయల భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు కలిసి రావాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లాకు తక్షణం రూ.10 వేల కోట్లు కేటాయించాలన్నారు. పశ్చిమ ప్రాంతంలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. కరువు, తాగునీటి సమస్యలు, సాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయని చెప్పారు. వెలిగొండను పూర్తిచేయడమే ప్రత్యామ్నాయమన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీకి మారిందే తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ప్రతిప క్షంగా సిపిఎం ప్రజల పక్షాన నిలబడుతుం దన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరా టాలే తమ ఎజెండా అని చెప్పారు. రైతులు, కార్మి కులు, వివిధ వర్గాల ప్రజానీకం ఇంకా కష్టాల్లోనే ఉన్నారన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ విజన్ డాక్యుమెంటు ప్రకటించారని, నిధులు కేటాయించకుండా ఏ పనులు ముందుకు సాగవన్నారు. నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. వెనుకబాటు నివారించేందుకు కార్యాచరణ ప్రణాళికలు అవసరమన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారుమబ్బులతో కలవరం

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబరులో సంభవించిన వరదల కారణంగా జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో వరిపైరుకు నష్టం వాటిల్లింది. ఇప్పుడు కూడా మరోసారి పంట చేతికి అందివచ్చే దశలో తుపాను హెచ్చ రికలు, అల్పపీడన ప్రభావంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం గాలులతో కూడిన వర్షం కారణంగా వరి పైరు నేల కొరుగుతోంది. కోసి ఉన్న వరి ఓదెలు తడిచి పంట రైతు చేతికందే పరిస్థితి లేకుండా పోయే అవకాశం ఉంది. చేతికి అంది వచ్చేదశలో ఉన్న వరిపైరును కాపాడుకోవడం ఎలా.? అనే విషయమై రైతుల్లో ఆందోళన నెలకొంది. వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో వరి సాగు చేసిన రైతులు అపారంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వే ప్రక్రియలో పలు లోపాలు చోటు చేసుకున్నా యని, దీని వల్ల రైతులు ఇబ్బందులు పడు తున్నారన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుం దని, ఇది గొప్ప సదవకాశామని, దీనిని విని యోగించుకోవాలని కోరారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటి లింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం జరిగిందని, మీ భూమి మీ దగ్గరే ఉండాలన్న లక్ష్యంతో ప్రతి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టి.. ప్రభుత్వం యంత్రాంగం మీ దగ్గరకే వచ్చి.. భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ అధికారులతో పాటు అనుబంధంగా వున్న వంటి దేవాదాయ, ఫారెస్ట్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ తదితర సంబంధిత శాఖల అధికారులు వచ్చి సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తారని తెలిపారు. ఈ నెల ఆరు నుంచి జనవరి ఎనిమిదో తేదీ వరకు ఈ రెవె న్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 18,240 ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా, అక్రమాలు జరిగి నట్లుగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. భూ యజమానులకు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకి రశీదును అందజేస్తామన్నారు. జనవరి మొదటి వారంలో కొండపి, గిద్దలూరు నియోజక వర్గాల్లో జరిగే రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ శాఖ మంత్రి, సీసీఎల్ఏ అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సదస్సులు గ్రామీణ ప్రజలకు, రైతులకు గొప్ప సదవకాశమని, ఈ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి గ్రామసభ వద్ద ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను పరిశీలించారు. సచివాలయం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, మండల ప్రత్యేక అధికారి, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, తహశీల్దార్ ఆంజనేయులు, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, టంగుటూరు టిడిపి అధ్యక్షులు కామని విజయ్‌కుమార్, టంగుటూరు మండల దేవాదాయ శాఖ ఇన్‌చార్జి యడ్లపల్లి బైరాగి చౌదరి, వల్లూరు పంచాయతీ కార్యదర్శి రాధిక, విఆర్ఓ దుర్గాభవాని పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని ఇందిరమ్మ కాలనీ ఫస్ట్ లైన్ కాపురస్తులైన నా క్లయింట్స్ (1) సయ్యద్ కాశీం S/o ఇమామ్ (2) సయ్యద్ హామీదా W/o ఖాసిం అనువారు నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింట్స్ ఇరువురు తమ నివాసము నుండి రాజీవ్ నగర్ కాలనీ వెళుతుండగా ఇందులో ఒకటవ వారికి సంబంధించిన 3 బ్యాంకు చెక్కులు సంతకం చేయబడినవి రెండవ వారికి సంబంధించి ప్రామిసరి నోటు సంతకము చేయబడినది హాండ్ బ్యాగులో ఉన్నవి దారి మధ్యలో హ్యాండ్ బ్యాగ్ పోయినది. కావున ఇవి ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని క్రింది లాయర్ గారికి గాని తెచ్చిఇవ్వ వలసిందిగా ప్రార్థన. వీటిని ఎవరైనా అన్యాక్రాంతం చేసిన యెడల వారిపై మా క్లయింట్స్ తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు
కొత్తపల్లి శివన్నారాయణ
న్యాయవాది, ఒంగోలు
సెల్ : 9705923724

మహారాజరాజశ్రీ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

I.A.No. 284 of 2024
I.P. No. 42 of 2022

Between :
లక్కాకుల పురుషోత్తం ... పిటీషనర్ / వాది
And
డి. అఖిల & 42 అదర్స్ ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

నోటీసు టు రెస్పాండెంట్ నెం.17 / ప్రతివాది నెం.17

To : చదలవాడ ఈశ్వరకృష్ణ S/o శ్రీనివాసరావు, ఇంటి నెం. 2-207ఎ, కాకుటూరివారిపాలెం, టంగుటూరు, ప్రకాశం జిల్లా - 523274

పిటీషనర్ పై కేసులో తనను దివాలాదారునిగా ప్రకటించడానికి పిటీషన్ వేసినారు, సదరు పిటీషన్లో నీకు ఏదేని అభ్యన్తరములు వున్న ఎడల పై కనిన గౌరవ కోర్టు నందు తేది : 24-12-2024 నాడు ఉదయం 10.30 గంటలకు నీవుకానీ, అడ్వకేట్ ద్వారాకాని హాజరై నీకుగల అభ్యంతరములు తెలుపుకోగలవు, లేని యెడల నీ పరోక్షముగా పై కేసు తీర్మానించబడును.

వాయిదా తేది : 24-12-2024

మేడి జయశంకర్
దాసు హేమకుమార్
పిటిషనర్ తరపు న్యాయవాదులు, తిరుపతి

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S No : 367/2024

పల్లెబోయిన వెంకట రమణ ..వాది
వర్సస్
పంకు రమణమ్మ వగైరాలు .. ప్రతివాదులు

To

ప్రతివాదుల చిరునామా

D1)పంకు రమణమ్మ భర్త శ్రీనివాసులు,
హిందూ, వయస్సు 50 సంవత్సరాలు,
గృహిణి, ఆకవీడు గ్రామం,
రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా.

D3)పల్లెబోయిన శ్రీనివాసులు తండ్రి లేట్ రాజయ్య,
హిందూ, వయస్సు 46 సంవత్సరాలు, వ్యవసాయం,
నర్సిరెడ్డి పల్లి గ్రామం, కంభం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ:23-12-2024న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ : 9393442442

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 741/2023

యన్నం శివ శంకర్‌బాబు ..వాది
వర్సస్
గోళ్ళ వెంకట రామ్ ప్రసాద్‌రావు ..ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

గోళ్ళ వెంకట రామ్ ప్రసాద్ రావు
తండ్రి లేట్ వెంకట సుబ్బయ్య, హిందూ,
వయస్సు 60 సంవత్సరాలు, వ్యాపారం,
డోర్ నెం:8-70, వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గర, గాంధీ బజార్, కంభం గ్రామం, కంభం మండలం.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 18-12-2024న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ : 9393442442

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A No : 486/2024
in
O.S No : 367/2024

పల్లెబోయిన వెంకట రమణ ..పిటిషనర్/వాది
వర్సస్
పంకు రమణమ్మ వగైరాలు
.. రెస్పాండెంట్లు / ప్రతివాదులు

టు,

రెస్పాండెంట్స్ చిరునామా

R1)పంకు రమణమ్మ భర్త శ్రీనివాసులు,
హిందూ, వయస్సు 50 సంవత్సరాలు,
గృహిణి, ఆకవీడు గ్రామం,
రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా.

R3)పల్లెబోయిన శ్రీనివాసులు తండ్రి లేట్ రాజయ్య,
హిందూ, వయస్సు 46 సంవత్సరాలు, వ్యవసాయం,
నర్సిరెడ్డి పల్లి గ్రామం, కంభం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ / వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో మీరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ : 23-12-2024న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
పిటిషనర్/వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ : 9393442442

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్ కాపురస్తురాలు షేక్ జానీ గారి భార్య షేక్ మస్తాన్‌బీ అనువారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఈ క్రింది విధముగా ప్రకటన ఇవ్వటమైనది.

మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని తేది 17.04.2024న రామ్‌నగర్, సాగర్ కాలువ ప్రక్కన, అద్దంకి టౌన్ కాపురస్తుడైన వల్లెపు చిన్నబ్బి గారి కుమారుడైన వల్లెపు పెదవెంకటేశ్వర్లు దగ్గర బిల్‌కాంట్రాక్టుగా రూ.25,25,000/-లకు కొనుగోలు చేసి అదే రోజున రూ.4,00,000/-లు అడ్వాన్స్‌గా సదరు వెంకటేశ్వర్లు గారికి ఇచ్చియున్నారు. సదరు వల్లెపు పెద వెంకటేశ్వర్లు గారు అదే రోజున మా క్లయింటు పేరున స్థిరాస్తి విక్రయ ఖరారు అగ్రిమెంటు వ్రాయించి యిచ్చి మిగిలిన క్రయదనమును 81 రోజుల లోపల చెల్లించి, సదరు స్థలము కొలతలు వేయించి, మా క్లయింటు పేరున రిజిష్టరు చేయించి ఇచ్చులాగున అగ్రిమెంటులో వ్రాసుకొనడమైనది. కానీ సదరు పెద వెంకటేశ్వర్లు గారు ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని మా క్లయింటు పేరున రిజిష్టరు చేయకుండా కాలము గడుపుచున్నారు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని మా క్లయింటు ప్రేమయము లేకుండా ఎవరైనా కొన్న యెడల మరియు అమ్మిన యెడల అది చట్ట ప్రకారము చెల్లదని, దీనిని ఉల్లంఘించిన వారిపై మా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు వారు బాధ్యత వహించగలరని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

బాపట్ల జిల్లా, అద్దంకి సబ్ రిజిస్ట్రారులో చేరిన అద్దంకి మండలం, శింగరకొండపాలెం గ్రామ పంచాయితీ ఏరియాలోని కలవకూరు శివారు, శింగరకొండపాలెం గ్రామ సర్వే నెం. 647లో య.0-50 సెంట్లు భూమికి హద్దులు :-

తూర్పు : దేపూరి కిషోర్ కుమార్ భూమి
దక్షిణము : ముప్పవరం పోవు రోడ్డు
పడమర : ఇతరుల ప్లాట్లు
ఉత్తరం : గోలి హనుమయ్య, వగైరాల భూమి

ఇట్లు
గుడిపూడి సురేంద్ర, B.Sc., LL.B.,
యం.ప్రమోద్,
జె.అనిల్ కుమార్
న్యాయవాదులు,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.

పోలీస్ శాఖకు 'డ్రోన్' పరికరం బహూకరణ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డివిజన్ పోలీస్ శాఖకు అత్యాధునిక డ్రోన్ పరికరాన్ని మార్కాపురం పట్టణంలోని శ్రీకందుల ఓబులరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి మంగళవారం బహూకరించారు. దీని ఖరీదు సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. అత్యాధునిక మైన డిజెఐ ఎయిర్ 3ఎస్ డ్రోన్ పరికరాన్ని అందించారు. సిఎం నారా చంద్రబాబు విజన్ స్ఫూర్తితో, నవ్యాంధ్ర కోసం విన్నూతనమైన ఆలోచన సరళితో ప్రేరేపణ పొంది ఈ పరికరాన్ని బహూకరించినట్లు డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి తెలిపారు. డ్రోన్ పరికరాన్ని ఒంగోలులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఈ పరికరాన్ని అందుకున్నారు. అనంతరం దాని పనితనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ అత్యాధునిక డ్రోన్ వలన చాల ఉపయోగాలు ఉంటాయన్నారు. కెమెరా అనుసంధానమైన రికార్డింగ్ సౌకర్యం, ఈదురుగాలులు తట్టుకుని, వర్షంలో కూడా చాలా ఎత్తుకు ఎగరగలిగే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఆకాశంలో కిలోమీటర్ల దూరం ప్రయాణించగలిగే బ్యాటరీ సామర్థ్యం ఉందని తెలిపారు. ఈ డ్రోన్ సహాయంతో ట్రాఫిక్ వ్యవస్థ సరళీకృతం చేయడం, ట్రాఫిక్ జామ్ కంట్రోల్ చేయడంలో, పోలీస్ బందోబస్తు ఏర్పాటులో సమస్యలను అధిగమించడం, విగ్రహాల ఊరేగింపుల్లో ఎంతో ఉపయోగమని చెప్పారు. దొంగతనాలను అరికట్టడంలో, ఆకతాయిలను నిలువరించడంలో, పొలాల్లో తాగుబోతులను, అరికట్టవచ్చని అన్నారు. డ్రగ్స్, గంజాయి కంట్రోల్ చేయడంలో, కొండల్లో, గుట్టల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి సేవించడం వంటి యాంటీ సోషల్ ఆక్టివిటీస్‌ను అరికట్టడంలో దోహదపడుతుందని అన్నారు. డ్రోన్ పంపిణీ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ యు నాగరాజు, మార్కాపురం సిఐ పి సుబ్బారావు, మార్కాపురం పట్టణం, రూరల్ ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డ్రోన్ పరికరాన్ని బహూకరించిన డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డిని ఎస్‌పి దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.



డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి అందజేసిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

కోర్టు నోటీసులు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

కోర్టు ఉత్తర్వులను తీసుకోకుండా నిరాకరించిన ఉద్యోగులపై బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వుల పట్ల కూడా గౌరవం లేకుండా వ్యవహరించడం ఏం పద్ధతని అసహనం వ్యక్తం చేశారు. మండలం లోని కోనపల్లి, బసినేపల్లి, కాజీపురం, ఎంపీ చెరువు, వంగపాడు, పిటిగాయగుల్ల గ్రామాల వివోఏలను తొలగించామని చెబుతూ సంబంధిత ఉద్యోగులు బ్యాంకులకు లేఖలు పంపడం పట్ల ఆయా గ్రామాల వివోఏలు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సంబంధిత రికార్డుల ను పరిశీలించిన అనంతరం వివోఎల తొలగింపును నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను మండల కేంద్రంలోని ఏపీఎం కార్యాలయంలో అందజేసేందుకు వెళ్లగా వీటిని తీసుకునేందుకు అక్కడి అధికారులు, సిబ్బంది నిరాకరించారు. దీంతో వారి తీరుపై ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు కాపీలను తీసుకోవాల్సిందిగా కోరినప్పటికీ నిరాకరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కోర్టు కాపీలను తీసుకునేందుకు నిరాకరించిన ఏపీఎం ఆనందకుమారి, సీసీ కళ్యాణి, ఆఫీస్ ఇన్‌ఛార్జిలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టు కాపీలను తీసుకున్నారు. సుమారు గంటపాటు కోర్టు కాపీలు తీసుకునేందుకు నిరాకరించడం, స్వయంగా ఎంపీపీనే కార్యాలయానికి వెళ్లినా నిరాకరించడం, తరువాత ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా అధికారులు పద్ధతి మార్చుకోవాలని ఎంపీపీ హెచ్చరించారు.

సైనికుల సంక్షేమానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కంభం రూరల్

దేశ సైనికుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. కంభం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన కంభం మాజీ సైనికుల కార్యాలయాన్ని మంగళవారం ఉదయం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి సేవలు అందించే సైనికులు ఉండటం మన గిద్దలూరు నియోజకవర్గానికే గర్వ కారణమని అన్నారు. ఇటీవల కాలంలో జమ్మూలో తాను ప్రాణాలు కోల్పోతానని తెలిసి కూడా, మరో 30 మంది ప్రాణాలు కాపాడిన అమరవీరుడు మన రావిపాడు గ్రామానికి చెందిన వరికుంట్ల వెంకటసుబ్బయ్య అని, వారి ప్రాణ త్యాగం దేశానికే గర్వకారణమని అన్నారు. అమరులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముత్తుముల అన్నారు. ప్రకాశం జిల్లాలోనే అత్యధికంగా దేశ సైనికులు గిద్దలూరు నియోజకవర్గంలో ఉన్నారని, వారి సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనికుల జిల్లా వెల్ఫేర్ అధికారి రజినీకుమారి, మాజీ సైనికులు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

పేదల సొంతింటి కల నెరవేరుస్తా: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో పేదల సొంతింటి కల నేరవేర్చేందుకు కృషి చేస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ 267 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించారన్నారు. కొందరు బేస్‌మెంట్ లెవల్, మరికొందరు రూఫ్ లెవల్‌కు నిర్మాణం చేపట్టారన్నారు. అప్పట్లో ఇంటి నిర్మాణం కోసం రూ.15 వేలు లేదా రూ.20 వేలు మాత్రమే మంజూరు చేసినట్లు తెలిపారు. తాజాగా ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షల మేర ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఇంటి నిర్మాణం చేపట్టినవారు గతంలో తీసుకున్న పైకం గృహ నిర్మాణ సంస్థకు చెల్లిస్తే తాను కొత్తగా ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ అవకాశాన్ని ఇక్కడి పేదలు సద్వినియోగం చేసుకోవాలని, సొంతింటి కలను నెరవేర్చుకోవాలని సూచించారు. మీ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అందించే సహాయ సహకారాలన్నీ పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, గృహ నిర్మాణ సంస్థ డిఇ పవన్‌కుమార్, టిడిపి రాష్ట్ర వ్యాణిజ్య విభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, టిడిపి నాయకులు మాలపాటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రెవెన్యూ సంబధిత సమస్యలతో పాటు అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు మార్కాపురం కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. యర్రగొండపాలెం మండలంలోని అమానుగుడిపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. 36 మంది బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే సంక్షేమ పథకాల కోసం అందిన దరఖాస్తులను సంబధిత అధికారులకు నివేదించి మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏ బాలకిశోర్, వీఆర్వోలు మోహన్‌రావు, సత్యనారాయణ, ఖాదర్‌వలి, ఓబయ్య, డేవిడ్, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల వల్ల సులభంగా భూ సమస్యలు పరిష్కరింపబడతాయని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ఎస్ వరకుమార్ తెలిపారు. సంతనూతలపాడు ఒకటో సచివాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని సంతనూతలపాడు 1వ సచివాలయం విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ పసుపులేటి వెంకటస్వామి పర్యవేక్షించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 20 అర్జీలు దాఖలు అయ్యాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, డిప్యూటీ తహశీల్దారు ఎస్కే మాబు సుభాని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి రామ్‌తేజ, మండల ఎండోమెంట్స్ ఇన్‌చార్జి మద్దినేని శ్రీనివాసరావు, వీఆర్వోలు పి వెంకటస్వామి, డి శ్రీనివాసులు, రవికుమార్, ఎం శ్రీనివాసులు, వెన్నెల, రామాంజనేయులు, హనుమంతరావు, జాలయ్య, సర్వేయర్ ఏ ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు పిఎన్ఎస్ చౌదరి, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, ఎం పోలిశెట్టి, ఎస్ ఉమా, కే ఆంజనేయులు, కే అంకమ్మరాజు, పలువురు రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలం చాపలమడుగు గ్రామ సచివాలయ ఆవరణంలో ఉప తహశీల్దార్ కిరణ్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రాములు నాయక్ మాట్లాడుతూ గ్రామంలో పొలాల విషయమై రైతుల మధ్య తగాదాలు, రహదారుల సమస్యలు, ఒకరి భూమి మరొకరు అక్రమించుకోవడం లాంటి ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ కిరణ్ మాట్లాడుతూ రైతులు గ్రామస్తుల సహకారంతో ఎన్నో ఏళ్లుగా జటిలమైన భూమి సమస్యలను సైతం సులువుగా పరిష్కరించడానికి ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపి దేవాదాయ శాఖ బార్బర్ అసోసియేషన్

జిల్లా కన్వీనర్‌గా రంగస్వామి

ప్రజాశక్తి-రాచర్ల



ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ ఆలయాల నాయీ బ్రాహ్మణ కేశఖండనశాల బార్బర్స్ కార్మిక సంఘం జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ, విద్యాధరపురం చెరువు సెంటర్, కోదండ రామస్వామి ఆలయంలో ఏపి దేవా దాయ ధర్మాదాయ శాఖ ఆలయాల బార్బర్ అసోసి యేషన్ జేఏసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ కేశఖండనశాల, బార్బర్ కార్మికులకు రూ.25,000 జీతాలు ప్రకటించిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రకాశం జిల్లా కన్వీనర్‌గా రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం బార్బర్ కనుమర్లపూడి రంగస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయీ బ్రాహ్మణ బార్బర్లు రంగస్వామికి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికలు తయారు చేయాలని ఎంపిడిఓ బండారు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం యర్ర గొండపాలెం పట్టణంలోని మండల పరిషత్ సమావేశపు భవనంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో మండలంలోని సచివాల య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణనిచ్చారు. ఎంపీడీవో శ్రీనివా సులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధు లు సమర్థంగా వినియోగించుకోవడంపై అవగా హన కల్పించారు. మండలంలోని ప్రతి పంచా యతీలో సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిని వంద రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి జడ్సన్ పాల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ, పద్మజ, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పి నీటి పంపిణీ సంఘాల ఎన్నిక

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక హైస్కూల్లో మంగళవారం నీటి పంపిణీ సంఘల ఎన్నికలు జరిగాయి. కమిటీ ఎన్నికల్లో సంతనూతలపాడు ఒకటో డిసి (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) అధ్యక్షులుగా రామా శ్రీనివాసరావు (కొణిజేడు-1), ఉపాధ్యక్షులుగా చెరుకూరి శ్రీనివాసరావు (సంతనూతలపాడు-1), రెండో డిసి అధ్యక్షులుగా కంకణాల వేణు(వల్లూరు) ఉపాధ్యక్షులుగా దామచర్ల శ్రీనివాసరావు (కందులూరు-2) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి డిక్లరేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు మున్సిపల్ ఎంఇ ఎన్ చంద్రయ్య, జిఆర్‌పి ఇఇ శ్రీహరి అందజేశారు. సంతనూతలపాడు ఒకటో డిసి పరిధిలో ఎనిమిది సంఘాలు ఉండగా రెండో డిసి పరిధిలో 7 సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలోని అధ్యక్షులు డిసి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ జడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్, మాజీ సొసైటీ అధ్యక్షులు సాధినేని శ్రీరామమూర్తి, మంగమూరు టిడిపి అధ్యక్షులు అబ్బూరి శ్రీనివాసరావు, నీటి సంఘాల అధ్యక్షులు నువ్వుల శ్రీనివాసరావు, రామా శ్రీనివాసరావు, చెరుకూరి శ్రీనివాసరావు, బొల్లినేని వెంకట సుబ్బారావు, రావి వెంకట్రావు, కాజా పరుశురామిరెడ్డి, బొమ్మినేని తిరుపతి స్వామి, అబ్బూరి చిన్న శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పి డిఈఈ ఐ పద్మావతి, జెఇలు ఎస్‌కె కరీం బాషా, రమణారెడ్డి, అరుణ, దేవేంద్ర పాల్గొన్నారు.

నీటి పంపిణీ సంఘాల ఎన్నికలు ప్రశాంతం

- నూతన డిసి చైర్మన్లు, వైస్‌చైర్మన్లను అభినందించిన మంత్రి గొట్టిపాటి

నీటి పంపిణీ సంఘాలకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పలు చోట్ల డిసి చైర్మన్లు, వైస్‌చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి- అద్దంకి

రైతుల సంక్షేమమే ధ్యేయంగా సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు పనిచేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి నియోజక పరిధిలోని నాలుగు సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీలకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. జె.పంగులూరు మండల డిసి ఛైర్మన్‌గా కుక్కపల్లి ఆంజనేయులు, వైస్‌చైర్మన్‌గా ధూళిపాళ్ల వీరాస్వామి, అద్దంకి డిసి చైర్మన్‌గా బండారుపల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా పేరయ్య ,సంతమాగులూరు డిసి ఛైర్మన్‌గా కామాను శ్రీనివాసరావు వైస్‌చైర్మన్‌గా వల్లెం నరసింహ, కొమ్మాలపాడు డిసి ఛైర్మన్‌గా కంచెటి యలమంద, వైస్ చైర్మన్ గా కక్కెర సుబ్బారావు' ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎకగ్రీవంగా ఎన్నికైన డిసి చైర్మన్లు, వైస్ చైర్మన్లకు మంత్రి రవికుమార్ అభినందనలుతెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కీలకమైన జలవనరులశాఖ గత ప్రభుత్వ హయాంలో రైతులకు దూరమైనట్లు తెలిపారు. పనుల గుర్తింపు, నిర్వహణలోపారదర్శకత, జవాబుదారీ తనం లేకుండా పోయిందన్నారు. సాగునీటి సంఘాల పునర్జీవంతో రైతుల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టవచ్చని మంత్రి పేర్కొన్నారు.

పొన్నూరు-2 డిసి చైర్మన్‌గా శ్రీకాంత్‌బాబు

బాపట్ల : బాపట్లలోని పశ్చిమ ఉపవిభాగం సబ్ డివిజన్ కార్యాలయంలో సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. పొన్నూరు-3 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా అప్పికట్ల సాగునీటి సంఘం అధ్యక్షుడు ఇనగంటి శ్రీకాంత్ బాబు ఎన్నికయ్యారు. లాటరీపద్ధతి ద్వారా శ్రీకాంత్‌బాబు చైర్మన్‌గా ఎన్నికైనట్లు జలవనరుల విభాగం బాపట్ల డిఇ ఎస్‌కె. జాకీర్ బాషా తెలిపారు . వైస్ చైర్మన్ వల్లభరావు పాలెం నీటి సంఘం అధ్యక్షులు బొద్దులూరి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. బాపట్ల డిసి ఛైర్మన్‌గా పేరలి -2 సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లారపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కర్లపాలెం-1 సాగునీటి సంఘం అధ్యక్షుడు దొప్పలపూడి రాజశేఖర్ బాబు ఎన్నికైనట్లు డిఇ జాకిర్ బాషా తెలిపారు. ఎన్నికల అధికారి ధనలక్ష్మి ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఇలు జి. శిరీష, సి. రవీంద్రబాబు, సిహెచ్. జానీ బాషా, కే. రామ్మూర్తి, జీవీ.రమణ, కె. ఆంజనేయులు, అప్పికట్ల టిడిపి నాయకులు ఇనగంటి గాంధీ, అమర్నాథ్, మహేంద్రనాథ్ చౌదరి, దాచేపల్లి గోపాలరావు,గరికపాటి నాగేశ్వరరావు, చెన్నుపాటి రామకష్ణయ్య, సకుర్తి అంజిలి,సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న పొన్నూరు -3 డిసి చైర్మన్ ఇనగంటి శ్రీకాంత్ బాబు


చెరుకుపల్లి డిసి చైర్మన్‌ను అభినందిస్తున్న నాయకులు

చెరుకుపల్లి డిసి చైర్మన్‌గా రాధాకృష్ణమూర్తి

చెరుకుపల్లి : చెరుకుపల్లి, అమతలూరు మండలాల సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా ఎం. రాధాకష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమతలూరు మండలం కూచిపూడి సాగునీటి సరఫరా కార్యాలయంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. చెరుకుపల్లి, అమతలూరు మండలాల పరిధిలోని ఆరు సాగునీటి సంఘాల పరిధిలో నిర్వహించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నికలలో రాధాకష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎవరూ పోటీ చేయకపోవడంతో రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కూచిపూడి సాగునీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దివ్యభారతి తెలిపారు. ఎన్నికల అధికారిగా హౌసింగ్ బోర్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏమినేని వెంకటేశ్వరరావు వ్యవహరించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన రాధాకష్ణమూర్తిని చెరుకుపల్లి మండల టిడిపి నాయకులు మల్లాది రామకష్ణ, కొనకాల రవి కిరణ్ గౌడ్, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీను, తుళ్లూరు శివ వెంకట రామారావు తదితరులు అభినందించారు.


సంతమాగులూరు డిసి చైర్మన్‌ను అభినందిస్తున్న నాయకులు

సంతమాగులూరు డిసి చైర్మన్ శ్రీనివాసరావు

సంతమాగులూరు : సంతమాగులూరు సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా అడవి పాలెం గ్రామానికి చెందిన కామాను శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్ఎస్‌పి కార్యాలయ ఆవరణలో సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కామాను శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఏల్చూరు గ్రామానికి చెందిన వల్లెం నాసరయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సంఘాల అభివద్ధికి కషి చేస్తామని తెలిపారు. అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు, నాసరయ్యకు నాయకులు చేవూరు వాసు రెడ్డి, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, గాడిపర్తి వెంకటరావు, నక్కా వెంకటేశ్వర్లు, చింతా శ్రీధర్ అభినందులు తెలిపారు.

చీరాల డిసి చైర్మన్‌గా పాండు రంగారావు

చీరాల :పట్టణంలోని డ్రైనేజీ అతిథి గహంలో మంగళవారంనీటి పంపిణీ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.ఈ నేపథ్యంలో చీరాల డిసి చైర్మన్‌గా స్వర్ణ పాండు రంగారావు, వైస్ చైర్మన్ నక్కల నాగరాజు ఎన్నికయ్యారు. చిన్నగంజాం డిసి చైర్మన్‌గా పొద వీరయ్య, వైస్ చైర్మన్‌గా జాగర్లముడి సాయి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డ్వామా పీడీ విజయలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ ప్రసాద్ పాల్గొన్నారు.

పంగులూరు డిసి చైర్మన్‌గా ఆంజనేయులు



పంగులూరు.: పంగులూరు డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా కుక్కపల్లి ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో పంగులూరు పరిధిలోని 11 టీసీలు ఏకగ్రీవమయ్యాయి.కొండ మంజులూరు-1 టిసిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుక్కపల్లి ఆంజనేయులు డిసి చైర్మన్, వైస్ చైర్మన్ దూళిపాళ్ళ వీరస్వామి ఎన్నికయ్యారు.


ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

జీతాలు ఇవ్వాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - చీరాల

పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరుతూ ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు చీరాల పట్టణ కార్యదర్శి ఎం. వసంతరావు గత ఆరు నెలలుగా పంచాయతీ కార్మికులు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అప్పులు చేసి పూట గడపుకుంటున్నట్లు తెలిపారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మిలకు జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ శివసుబ్రహ్మణ్యం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్, ఇండ్ల చెంచయ్య, నాయకులు నాగమ్మ,సునీత, నవీన్, వెంకటేష్, సిఐటియు నాయకుడు ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

'కాసల'కు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి- అద్దంకి



పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట సాహితీ పురస్కారం-2024ను అధ్యాపకరత్న, సమీక్షా సామ్రాట్ డాక్టర్ కాసల నాగభూషణం అందు కోనున్నారు. పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి చేతుల మీదుగా ఈనెల 22న అద్దంకి ఇందిరానగర్, పుట్టంరాజువారి వీధిలోని పుట్టం రాజుకళాక్షేత్రంలో నాగభూణంకు పురస్కారాని అందజేయనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.


మాట్లాడుతున్న నాగాంజనేయులు

ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

విద్యుత్ ట్రూఆప్ ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రూఆఫ్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో ప్రజలపై విద్యుత్తు భారాలు మోపుతున్నట్లు ఆయన తెలిపారు. అసలు కంటే కొసరు ప్రజలపై అధికంగా పడుతుందన్నారు. ప్రభుత్వ రంగంలో సోలార్ విద్యుత్తును యూనిట్ రూ.1.90 పైసలకు ఇస్తామంటే గత ప్రభుత్వం ఆదాని సోలర్ విద్యుత్ ఉత్పత్తి నుంచి రూ. 2.50 పైసలకు ఒప్పందం చేసుకొని కోట్లాది రూపాయల ముడుపులు తీసుకున్నట్లు తెలిపారు. అదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దు తామంటున్న కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలను మోపటం దారుణమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసహరించుకోవాలన్నారు. లేకుంటే విద్యుత్ వినియోగదారులతో కలిసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, బండారి శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకుడు వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పంగులూరు

రైతులు రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని చీరాల ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచిచన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సింగారావు, మండల సర్వేయర్ సురేష్, పంగులూరు గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరావు, రెవున్యూ సిబ్బంది, నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు : మండల పరిధిలోని గాజులంక గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ 3 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సమకా వెంకట్రావు ఎంపిడిఒ నరసింహారావు డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు

బల్లికురవ : మండల పరిధిలోని అంబడిపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రవినాయక్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు అధ్యక్షుడు దద్దాల అంజయ్య, ఆర్ఐ పోతురాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల పరిధిలోని జాగర్లమూడి గ్రామములో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రవి కుమార్ మాట్లాడుతూ రైతులు భూసమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలన్నారు.సదస్సులో మొత్తం 5 అర్జీలు వచ్చిన్నట్లు తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు ,ఆర్ఐ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కరరావు, ఎంపిటిసి సాంబయ్య,గ్రామ నాయకులు వెంకట స్వామి, నెహెమ్యారావు, రైతులు పాల్గొన్నారు.



పంగులూరులో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు

రేపల్లె : మండల పరిధిలోని సింగుపాలెం, నల్లూరుపాలెం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండల పరిధిలోని పెసర్లంక, చింతమోటు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పెసరలంకలో నిర్వహించిన సదస్సులో గ్రామానికి యన్నం సురేష్ అనే రైతు తన పొలాన్ని ఆక్రమించి మధ్యలో రోడ్డులో ఏర్పాటు చేశారని, ఆ రోడ్డును తొలగించి తన పొలాన్ని తనకు అప్పగించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. దీంతో స్పందించిన తహశీల్దారు రెవెన్యూ సదస్సు ముగిసిన తర్వాత యన్నం సురేష్ పొలంలో అక్రమంగా వేసిన రోడ్డును పరిశీలించారు. బాధితుడు యన్నం సురేష్‌కు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకర్రావు, కార్యదర్శులు కాసుల గణేష్, లక్ష్మి, ఆర్ఐ ఫణి కుమార్, విఆర్ఒ జక్రరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వికాసమేదీ?

- మరుగునపడ్డ క్రీడా సామగ్రి
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో క్రీడా వికాసం మసకబారుతోంది. క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవుతోంది. ఫలితంగా మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు మరుగున పడిపోతున్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారిని దేశ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని అప్పటి టిడిపి ప్రభుత్వం భావించింది. రూ.రెండు కోట్ల స్పోర్ట్స్ అథారిటీ నిధులతో 2018 మే 14వ తేదీన యర్రగొండపాలెం పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు శంకుస్థాపన చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేశారు. అంతలోనే ప్రభు త్వం మారి వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన ఆదిమూలపు సురేష్ క్రీడా వికాస కేంద్రానికి వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రంగా నామకరణం చేసి ఆర్భాటంగా ప్రారంభిం చారు. అయితే వాటి నిర్వహణకు వైసిపి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది. మంజూరైన క్రీడా పరికరాలు మూలకు చేరాయి. క్రీడా వికాస కేంద్రంలో షటిల్ కోర్టులు రెండు, జిమ్ చేసుకునే సామగ్రి మాత్రమే ఉన్నాయి. ఇతర క్రీడా సామగ్రి లేదు. దీంతో



శిలాఫలకం



నిరుపయోగంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం

క్రీడాకారులు కేంద్రానికి వెళ్లడమే మానుకున్నారు. ఆర్భాటంతో ప్రారంభించిన క్రీడా వికాస కేంద్రం పనికి రాకుండాపోవడంతో తీవ్ర మదన పడుతున్నారు. రూ.రెండు కోట్ల నిధులు వృథా అయినట్లుగా పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధులు విడుదల చేసి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఆర్భాటంగా ప్రారంభం..

2014లో టిడిపి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో నియోజకవర్గానికి ఓ క్రీడా వికాస కేంద్రాన్ని అప్పటి సిఎం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో ఈ కేంద్ర నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో కేంద్రాల నిర్వహణ గురించి ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రీడా వికాసానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఖర్చు పెట్టకపోవడం శోచనీయమని క్రీడాకారులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి పరచాలని వారు కోరుతున్నారు.

క్రీడా వికాస కేంద్రంలో సౌకర్యాలు లేవు

దుదేకుల నాసర్‌వలి, యర్రగొండపాలెం



క్రీడల్లో రాణించే యువతీ యువకులు ఉన్నారు. ఇక్కడ షటిల్ కోర్టులు, జిమ్ సామగ్రి మినహా ఏ ఇతర క్రీడా సామగ్రి లేదు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టి ఈ క్రీడావికాస కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావాలి. క్రీడాకారులు సత్తాచాటి రాష్ట్ర, దేశ క్రీడల్లో రాణించే అవకాశాలున్నాయి.

క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి పరచాలి

షేక్ రియాజ్, యర్రగొండపాలెం



యర్రగొండపాలెం ప్రాంతంలో మట్టిలో మాణిక్యాల్లాంటి ఎందరో క్రీడాకారులున్నారు. వారికోసం క్రీడా వికాస కేంద్రం నిర్మించారంటే ఎంతో సంబరపడ్డాం. అది మూన్నాళ్ల ముచ్చటగానే ఉంది. తలుపులు తీసే దిక్కు లేరు. వికాస కేంద్రాన్ని అభివృద్ధిపరచి దానిని క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలి.



గిద్దలూరు మండల వీఆర్వోల సంఘం నూతన కమిటీ ఇదే!

వీఆర్వోల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో గిద్దలూరు మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్య వర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైపి రంగయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గిద్దలూరు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులుగా అరిగల వెంకటరామయ్య, ఉపాధ్యక్షులుగా అనురాజుల లక్ష్మీదేవి, కార్య దర్శిగా బిజ్జం రాజశేఖరరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దూదేకుల ఖాసింవలి, కోశాధికారిగా సూరా ఈశ్వర్‌రెడ్డి, ఆర్గనైజర్లుగా కొండయ్య, వి రమణ, ఎస్ రామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు వైపి రంగయ్య తెలిపారు. వీఆర్వోల సమస్యల పరిష్కారానికి మండల కమిటీ కట్టుబడి ఉంటుందని, వీఆర్వోలు ఐకమత్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైపి కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు పట్టణం విట్టా సుబ్బరత్నం కల్యాణ మండపంలో మంగళవారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి రవీంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్స్ డే కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు వైసిపి హయాంలో ఉద్యోగులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ చెల్లింపులో అలసత్వం ప్రదర్శించిందని, ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో అధికారంలోకి వచ్చిన వైసిపి పాలకులు ఉద్యోగులను అగౌరవపరిచారని, నేడు ఎన్‌డిఎ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు సకాలంలో వేతనాలు అందుతున్నాయని, పెన్షనర్లకు 12వ పీఆర్‌సీ చెల్లింపులు, ఆరోగ్య భద్రత కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిద్దలూరు నియోజకవర్గ విశ్రాంత ఉద్యోగుల సంఘ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. యూనిట్ సభ్యులను, అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ఖజానా అధికారి వరకుమార్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ రఘురాం, మేనేజర్ రామ్మోహన్, విశ్రాంత ఉద్యోగులు, సంఘం నాయకులు, సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మర్రివేములలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని మర్రివేముల, శతకోడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మర్రివేముల గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించి మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉందని, కత్తెర పురుగు నివారణ చర్యలకు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి గోపికృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతిని నివారించాలన్నారు. కంది పంట వేసిన రైతులు త్వరలో కందిపంట కొనుగోలు కేంద్రాలను



'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కంది పంట కొనుగోలు కొరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏలు ఎం మంత్రునాయక్, వి మస్తాన్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గిద్దలూరు మండలం కొమ్మునూరు, కొత్తకోట గ్రామాల్లో మండల వ్యవసాయాధి కారి విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వ హించారు. మండల వ్యవసాయాధికారి మాట్లా డుతూ రైతులు అందరూ తప్పనిసరిగా 2024 -25 రబీ సీజన్లో వేసిన ప్రతి పంటకు ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అతివృష్టి అనావృష్టి సంభవించినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం, పంటల బీమా, మద్దతు ధర, సున్నా వడ్డీ తదితర ప్రభుత్వ సహాయాలు ఈ-పంట ద్వారా అందుతాయని తెలిపారు. ఉద్యాన శాఖాధికారి విష్ణుప్రియ మాట్లాడు తూ ప్రస్తుతం మిరప, టమాటా మొదలైన పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆ పంటల లో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్లుపల్లి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శేఖర్, మొహమ్మద్ నూర్, రైతులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న హెచ్ఎమ్, రిటైర్డ్ హెచ్ఎమ్

22న ప్రజ్ఞా వికాస పరీక్ష

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు సాయి చైతన్య డిగ్రీ కాలేజీలో యూటిఎఫ్, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సంఘాల నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని రిటైర్డ్ హెడ్మాస్టర్ రాంభూపాల్‌రెడ్డి, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యా యులు నాగభూషన్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడు తూ విద్యారంగ సమస్యలపై పోరాటాలే కాకుండా విద్యార్థులను చదువు, క్రమశిక్షణలను ప్రోత్సహించే దుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడాన్ని అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష బాగా ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మండల స్థాయి విజేతలకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-కొమరోలు



వీరశేఖర్‌కు ట్రై సైకిల్ అందజేస్తున్న నిర్వాహకులు

కొమరోలు మండలంలోని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకు లు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ గిద్దలూరుకు చెందిన రాచకొండ వీరశేఖర్‌కు మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. అమ్మ ఫౌండేషన్ టీం సభ్యుల సహకారంతో పంపిణీ చేసినవాటిలో ఇది 10వ ట్రై సైకిల్. అనారోగ్య సమస్యల కారణంగా ఇటీవల వీరశేఖర్ కాళ్లకు ఆపరేషన్ జరిగి పూర్తిగా నడవలేని నిస్సహాయ స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితుల ద్వారా విన్న అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తన కార్యవర్గ సభ్యుల సహకారంతో ట్రై సైకిల్ అందజేశారు. తన నిస్సహాయ స్థితిని తెలుసుకొని తనకు ట్రై సైకిల్ పంపిణీ చేసిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడికి, వారి టీం సభ్యులందరికీ పేరుపేరునా వీరశేఖర్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ పందనబోయిన భూపాల్, సభ్యులు బోనేని అనిల్ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి బాలినేని

జనసేనలోకి 'నూకతోటి'

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట 42వ డివిజన్ వైసిపి అధ్యక్షులు నూకతోటి ఈశ్వరరావు మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో మంగళవారం హైదరాబాద్‌లో జనసేన పార్టీలో చేరా రు. బాలినేని శ్రీనివాసరెడ్డి నూకతోటి ఈశ్వరరావుకు జనసేన పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గోలి తిరుపతిరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, దొంతుల కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ

ప్రజాశక్తి - కురిచేడు

రైతుల సంక్షేమమే తెలుగుదేశం, ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. స్థానిక ఎన్‌ఎస్‌పి కాలనీలో మంగళవారం జరిగిన కురిచేడు మండల డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షుడు ఉన్నగిరి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బొల్లేపల్లి కనకయ్యల ప్రమాణ స్వీకారానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఉచిత గ్యాస్, ఫించన్ల పెంపు తదితర పథకాలను ప్రవేశ పెట్టి తాము ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. మండలంలో కొత్తగా ఏర్పడ్డ తొమ్మిది నీటి సంఘాల కార్యవర్గా లకు మండల నీటి సంఘ కార్యవర్గానికి తాము ఎప్పుడు అండగా ఉంటూ సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు. రైతుల అభివృద్ధికి కావాలసిన అన్ని సహాయ సహకారాలు అందించడానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు, మున్సిపాలిటీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రామారావు, టిడిపి మండల అధ్యక్షులు పిడతల నెమలయ్య, మాజీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్ వలి, గడ్డం బాలయ్య, కమతం నాగిరెడ్డి, పావులూరి కోటిలింగం, కురిచేడు టౌన్ అధ్యక్షులు మర్రి సుబ్బారావు, కిలారి కొండయ్య, టిడిపి దొనకొండ మండల అధ్యక్షులు మోడి వెంకటేశ్వరరావు, కురిచేడు జనసేన నాయకురాలు కాల్వ లక్ష్మీ కుమారి, మేరువ పెద్దిరెడ్డి, కమతం నాగిరెడ్డి, మండలంలోని నాయకులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్‌ను అభినందిస్తున్న పాలకవర్గం

దర్శి : స్థానిక ఎన్‌ఎస్‌పి కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ఎన్నికల కార్యక్రమం లో దర్శి-2 డిష్టిబూటరీ కమిటీ అధ్యక్షులు గా కామిరెడ్డి వెలుగొండారెడ్డి, ఉపాధ్యక్షులు గా మన్నం శేషయ్య, దర్శి-1 డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులుగా సందాడి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా వలేటి చలపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌పి ఇఇ ఎం రామకృష్ణ, డిస్టిబూటర్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు డిక్లరేషన్ ఫారం అందించారు. టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అన్ని విధాల మేలు చేసేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆదుకుంటున్నారని అన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి సంఘాలను నిర్వీరం చేశారని విమర్శించారు. ఈసారి ఈ ప్రభుత్వంలో కాలువల మరమ్మతులు చేసి అన్ని విదాలుగా రైతులకు మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎన్‌ఎస్‌పిడిలు కళాధర్ గిరిబాబు, స్థానిక నాయకులు, రైతులు వివిద హెూదాల్లో ఉన్న నాయకులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



డిక్లరేషన్ ఫారం అందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ కంచె ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఈనెల 16న 'ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని' ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ వార్తకు స్పందించిన విద్యుత్ శాఖ ఏఇ బ్రహ్మం సిబ్బందిని పంపించి కొనకనమిట్ల సచివాలయం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ మంగళవారం కంచె ఏర్పాటు చేసినట్లు లైన్‌మెన్‌లు వెంకటేశ్వర్లు, వి వీరారెడ్డి తెలిపారు.



భైరవకోనలో పూజలు చేస్తున్న జయసింహారెడ్డి

భైరవకోనలో ఎమ్మెల్యే తనయుడి పూజలు

ప్రజాశక్తి - సిఎస్ పురం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తనయుడు జయసింహారెడ్డి మంగళవారం దర్శించుకు న్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా జలపాతాన్ని వీక్షించారు. అనంతరం త్రిముఖ దుర్గా అమ్మవారిని, కాలభైరవ స్వామిని, శివలింగాలను దర్శించు కున్నారు. ఆలయ పూజారులు, స్వామి వారి శేష వస్త్రంతో ఆయనను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఏ కొత్తపల్లి సర్పంచ్ ముప్పాళ్ళ శ్యామలమ్మ, వెంకట రాజు, విక్రమ్‌రాజు, రాజేంద్ర, వెంకటసుబ్బయ్య పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఇఓ వంశీకృష్ణారెడ్డి, శ్యామ్‌సుందర్ రాజు ఆదేశాల మేరకు వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు.



పంచాయతీల అభివృద్ధిపై చర్చిస్తున్న ఎంపిడిఓ

పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ప్రజాశక్తి - సిఎస్ పురం

గ్రామ పంచాయతీలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందించాలని ఎంపిడిఓ రంగ సుబ్బరాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు వచ్చే నిధులను గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేసే విధంగా పని చేయాలని అన్నారు. గ్రామాల్లో పనులు గుర్తించి ప్రజలకు అవసరమైన వాటిని చేయాలని అన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - సిఎస్ పురం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని ఎంపిడిఓ రంగ సుబ్బ రాయుడు తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాల యంలో ఉపాధి హామీ సిబ్బందితో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం లో కూలీలకు పనులు కల్పించాలని అన్నారు. కూలీలకు వంద రోజులు పనులు కల్పించే విధంగా ఉపాధి సిబ్బంది పని చేయాలని అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించని గ్రామ పంచాయతీలు ఏవైనా ఉంటే వెంటనే గుర్తించాలని అన్నారు. సిబ్బంది బాధ్యతగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఓ వాక్యవతి, ఇసి రత్నబాబు, టిఏలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ రంగసుబ్బరాయుడు

గ్రామస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు ఆవుల సురేష్ సూచించారు. మండలంలోని కాట్రగుంట, పేరారెడ్డిపల్లిలో రెవిన్యూ సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ సమస్యలు పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం తీసుకుంటామని అన్నారు. ఎలాంటి రుసుము చెల్లించన వసరం లేదని తెలిపారు. సదస్సుల అనంతరం సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ కార్యాలయంలో అందుబాటులో ఉంటామన్నారు. ఈ సందర్భంగా 35 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఓ చెన్నకేశవులు, సర్పంచ్ గొంగటిలేవీ మరియమ్మ, మాజీ ఎంపిటిసి కందేర నాసరయ్య, టిడిపి నాయకులు గండూరి బాలచెన్నయ్య, తన్నీరు కృష్ణయ్య, కుర్ర బసవయ్య, పోలయ్య, మన్యం వెంకటేశ్వర్లు, లెనిన్ బాబు పాల్గొన్నారు.



కాట్రగుంటలో అర్జీలను స్వీకరిస్తున్న తహశీల్దార్ సురేష్

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది

ప్రజాశక్తి-తాళ్లూరు

మండలంలోని మన్నేపల్లి, తురకపాలెం, దారంవారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి పౌర సరఫరాల సంస్థ, రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల ద్వారా ధాన్యం కొలుగు చేస్తుందన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో విఎఎలు సుధీర్, నాగమల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు



ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారులు

సేవా దృక్పథం కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సమాజం పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, జాలి, సేవా దృక్పథం కలిగి ఉన్నప్పుడే ప్రజలందరూ సంతోషంగా ఉంటారని వైద్యాధికారులు ఎస్‌పి బాలయ్య, పృథ్వీరాజ్, కె.సురేఖ, ఫణి కుమార్, వడ్డే నరేంద్రలు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొని వారు మాట్లాడుతూ క్రీస్తు సూపిన మార్గం అనుసరణీయమన్నారు. ఆశ యూనియన్ నాయకురాలు ఎంబడి ఈశ్వరమ్మ మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో కలసి మెలిసి ఆప్యాయత అనురాగాలతో జీవించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎస్‌పి బాలయ్య, మహిళా వైద్యాధికారులు కె.సురేఖ, ఫణి, గొట్టగట్టు ప్రాథమిక వైద్యాధికారులు పృథ్వీరాజ్, వడ్డే నరేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ టి.ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రవికుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మస్తానమ్మ, పీహెచ్‌ఎన్ శైలజ హెచ్‌డి శ్యామల, ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు యంబాడి ఈశ్వరమ్మ, ఏఎన్ఎం, అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

21న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - దర్శి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శాసన సభ్యులు, వైఎస్ఆర్‌సిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 21న స్థానిక వైసిపి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు బ్లడ్ డొనేషన్ క్యాంప్ జరుగుతుందని అన్నారు. కావున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై రక్తదానం చేయాలని కోరారు. సేవాకార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



నిజాంపట్నంలో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు



అద్దంకిలో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి - నిజాంపట్నం

పదవ తరగతి మోడల్ పేపర్లు (స్టడీ మెటీరియల్) విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒ-ఆర్.శోభచంద్ తెలిపారు. నిజాంపట్నం జడ్‌పి హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు దాతలు శిఖినం శ్రీనివాసరావు, ఖాదర్, బి.ప్రసాద సహకారంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదవ తరగతి మోడల్ పేపర్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ దాతల సహకారంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదవ తరగతి మోడల్ పేపర్లు విద్యార్థులకు ఉచితంగా అందజేయడం అభినందని యమన్నారు. యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జడ వినయ్ కుమార్ మాట్లాడుతూ మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో మోడల్ పేపర్లు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్.బాపయ్య, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎర్రగళ్ళ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, గౌరవాధ్యక్షుడు గణేష్ రావు, కోశాధికారి కుమార్, జిల్లా కౌన్సిలర్స్ డి.హరిబాబు, రాజేష్, రామకష్ణ సిపిఎస్ కన్వీనర్ బి.వి.రమణ పాల్గొన్నారు.

అద్దంకి : మండల పరిధిలోనిగురుకాయ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్ పుస్తకాలు ఎంఇఒ బి సుధాకర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో యుటిఎఫ్ మోడల్ పేపర్స్ లోని ప్రశ్నలు 80 శాతానికి పైగా వస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.సుజాత, ఉపాధ్యాయులు ఏల్చూరి సుధాకర్, ఎంకె.శర్మ, సునీత, పద్మావతి, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఇ. రామారావు ప్రధాన కార్యదర్శి బి . పూర్ణచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -యద్దనపూడి

మండల పరిధిలోని పూనూరు, గన్నవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మేరిమ్మ మాట్లాడుతూ శనగ పంటను పచ్చ పురుగు, లద్దె పురుగు ఆశించే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చీరాల : మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సుమతి రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరి, మిర్చి పంటలను పరిశీలించారు. రైతులకు సూచనలు , సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో విఎఎలు లావణ్య, ధీరజ్, బచ్చేవా, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : శనగ పంటలో కుంకుమ తెగులు (తుప్పు తెగులు)నివారణకు చర్యలు చేపట్టాలని ఎఒ రామ్మోహనరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చెన్నూంబోట్ల వారిపాలెం, భూశాయపాలెం పాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మోహనరావు మాట్లాడుతూ శనగ పంటలో వచ్చే కుంకుమ తెగులు నివారణకు కాంటాఫ్ ప్లస్ 400 ఎంఎల్ లేదా టిల్ట్ 200 మాల్ లేదా వాలీదామైసిన్ 300 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఎఎ గిరి, ఎఇఒ శ్రీకాంత్, విఆర్‌ఎలుపాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి పంటను సాగు చేయడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వి. వాణిశ్రీ తెలిపారు. గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన అగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రాం బృందం వేటపాలెంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసిన పంటలను మంగళవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసిన రైతులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ రాష్ట్ర సీనియర్ థీమాటిక్ లీడర్ ప్రకాష్ రావు , థీమాటిక్ లీడర్ శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఎడి శ్రీనివాస రావు, ఎఒ కాశీ విశ్వనాథ్ , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు, గ్రామైక్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ప్రస్తుత సమాజంలోని పరిస్థితులు వాటి స్థితిగతులపై ఎప్పటికప్పుడు పిల్లలకు అవగాహన కల్పించాలని అమతలూరు సిడిపిఒ జి. విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసం శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ కిశోర బాలికలకు బలమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఎంపిపి డి. లలిత కుమారి మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్నపిల్లల నుంచి వద్దుల వరకూ రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నీలం దేవరాజ్, జడ్‌పిటిసి ఉదయ్ భాస్కరి, ఎపిఎం జి. శ్రీమన్నారాయణ, ఎసిడిపిఒ విజయరాణి, భట్టిప్రోలు, వెల్లటూరు, పల్లెకోన సెక్టార్ల అంగన్‌వాడీ సూపర్ వైజర్లు బి. సంపూర్ణ, డి. మాణిక్యం, కె. సునీత, హెడ్ కానిస్టేబుల్ కనికరం, అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ విజయలక్ష్మి

కారంచేడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు సిడిపిఒ తిరుమలశెట్టి ర్యూబీ మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్నపిల్లలు, టీనేజ్ పిల్లలు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరించారు. పోక్సో చట్టంపై అవగాహనపై అవగాహన కల్పించారు. పిల్లల మానసిక ,శారీరక ఎదుగుదలకు ఉపయోగపడే ఆహారం తయారీ గురించి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అనిత, ఎంపిడిఒ నేతాజీ, ఎంఇఒ సత్యనారాయణ, ఎపిఎం బుల్లయ్య , వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు,అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-బాపట్ల

సమాజంలోశాంతి స్థాపనకు క్రీస్తు బోధనలు అనుసరణీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయమ్మ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వెంకటేశ్వర్లు, ఆర్‌బిఎస్‌కె జిల్లా అధికారి సౌజన్య, భాస్కరరావు, కళ్యాణ్ గోపి, నితిన్, మౌనిక, ఎన్‌జిఒ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె : ఏసుక్రీస్తు శాంతి బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని రేపల్లె పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ కట్టుపల్లి విజయరాజు తెలిపారు. స్థానిక నేతాజీ నగర్ జేబీఎం చర్చిలో రేపల్లె ఫాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం : జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ జెవి. సుబ్బయ్య కేక్ కట్ చేసి సెమీకిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి. ఫణి సత్యనారాయణ, ఎం. జానమ్మ, ఎస్.రాంబాబు, కె.అనురాధ, వై.భాగ్యశ్రీ, పి.వి. రమణ, బి. హితవచన, కె.శారద, ఎ. కోటేశ్వరమ్మ వి.విజయలక్ష్మి, పద్మలత పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డిఎంహెచ్‌ఒ విజయమ్మ

పంగులూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర భంగా పాస్టర్ రవి ప్రార్ధనలు నిర్వహించి క్రీస్తు బోధనలను తెలియజేశారు. అనంతరం సెమీక్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.స్వరూప రాణి, ఇఒఆర్‌డి కె.సుమంత్, మండల పరిషత్ కార్యాలయ సూపరిం టెండెంట్ తాటికొండ రమేష్ ,పంచాయతీరాజ్ ఎఇ గడ్డం హనుమంతరావు, ఎపిఒ కె.సంతోషమ్మ, ఎపిఎం జ్యోతి ప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ లు బి .రాంబాబు, రామ్ సునీత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ పద్మజ, టిడిపి నాయకుడు గుడిపూడి రామారావు, పంచాయతీ సెక్రెటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి పాలకవర్గం డైరెక్ట్ పంపింగ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానిక టిఎం రావు ఉన్నత పాఠశాల ఎదురుగా వెల్లటూరు ఛానల్ పక్కన బోర్లు ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి భట్టిప్రోలు- చెరుకుపల్లి రహదారి వెంట పైపులను ఏర్పాటు చేసి బస్టాండు పరిసర ప్రాంతంతో అల్లూరు కాలువ కట్ట సమీపంలో ఉన్న గహాలకు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాగునీటిని అందించనున్నట్లు కార్యదర్శి కోట శ్రీనివాసరావు తెలిపారు. పైపులైన్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ వెంకయ్య మృతి

ప్రజాశక్తి -యద్దనపూడి



వెంకయ్య(ఫైల్)

మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎన్. వెంకయ్య మంగళవారం గుండె పోటుతో మతి చెందాడు. వెంకయ్య మృతదేహాన్ని ఎంపిడిఒ జావేద్, గ్రామ సర్పంచి రేణుకా బాలకోటేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది చంద్రహాస్, పంచాయతీ కార్యదర్శులు గ్రామ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధనపై మండల, గ్రామ స్థాయి అధికారులకు, సర్పంచులకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ డి.వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాల సుస్థిరాభివద్ధి కోసం ప్రభుత్వం 17 లక్ష్యాలను రూపొందించారన్నారు. అందులో పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, బాలహిత పంచాయతీ, సమృద్ధి నీరు కలిగి ఉండటం, స్వతంత్ర వనరులు కలిగి ఉండడం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, పారదర్శకత కలిగిన పరిపాలన కలిగి ఉండటం, మహిళా స్వావలంబన పంచాయతీలుగా తీర్చిదిద్దటం పై శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.గ్రామాల్లో సుస్థిరాభివద్ధి సాధించేందుకు అధికారులు కషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఎం.రవి శంకర్, సిడిపిఒ అనసూయ, ఎపిఎం మస్తాన్ రావు, ఎంఇఒ లు ఆర్.శోభా చంద్, శేషు గోపాలం, రీసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : గ్రామాల సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధనపై మండల స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ గ్రామాల సుస్థిరాభివృద్ధి కోసం అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి ఫ్యాకల్టీ నిరంజన్, యుపిఆర్‌డి కేజీ శ్రీనివాసన్, వెలుగు ఎపిఎం త్యాగరాజు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఈవూరి విజయబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ర్యాలీ

ప్రజాశక్తి -రేపల్లె

విద్యార్థుల జీవితానికి బంగారుబాటలు వేసి సమాజాభివృద్ధికి దోహదపడే ఉపాధ్యాయుల భద్రతకై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఫ్యాప్టో పట్టణ కన్వీనర్ సోషలిజం తెలిపారు. పాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సుబ్రహ్మణ్యం, బొర్రా వేణుమాధవ్, ఎం.అంకయ్య, జొన్నలగడ్డ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిల్లుల పెంపుదలకు నిరసనగా

కరెంట్ బిల్లులు దహనం


కరెంట్ బిల్లులు దహనం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రభుత్వం పెంచిన కరెంటు బిల్లులు తగ్గించాలని, ప్రజలపై వేసిన రూ.17 వేల కోట్ల భారాలను రద్దు చేయాలని సిపిఎం 49వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో 60 అడుగుల రోడ్డు జంక్షన్ లో మంగళవారం కరెంటు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి రమేష్ మాట్లాడుతూ ఈ నెల నుంచి కొత్త ట్రూ ఆఫ్ ఛార్జీల భారం ప్రజలపై మోపారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని, కరెంటు నష్టాలను ప్రభుత్వం భరించాలని, విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అదానీకి లబ్ధి చేకూర్చేందుకు ప్రజలపై కరెంటు భారాలు వేయడాన్ని తప్పుపట్టారు. గత ప్రభుత్వం తప్పిదమని చెప్పి ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడం తగదని హితవు పలికారు. వెంటనే విద్యుత్ బారాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శులు మాలకొండయ్య, జి ఆదిలక్ష్మి, 49వ డివిజన్ నాయకులు జి బాలకష్ణ, ఎం ఆదినారాయణ, పాపని సుబ్బారావు, టి వీరయ్య, కే రాజేశ్వరి, డి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

19న 'బెతూన్'లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ మోటూరు టాన్యా జయంతి సందర్భంగా ఒంగోలు, మంగమూరు రోడ్డులోని బెతూన్ నర్సింగ్‌హోంలో ఉచిత వైద్యశిబిరం ఈ నెల 19న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్, ఐద్వా సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. నేటి సమాజంలో మహిళ తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక తన కుటుంబం కోసం సర్వశక్తులను ధారపోస్తోందన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే తన కుటుంబాన్ని బాగా చూసుకోగలదన్నారు. తన ఆరోగ్యం పట్ల, స్త్రీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ల పట్ల ఒక అవగాహన అవసరమన్నారు. ఈ అవగాహన కోసం ప్రజా వైద్యులు డాక్టర్ ఎం.టాన్యా జయంతి రోజు ప్రతి సంవత్సరం డాక్టర్ బెతూన్ నర్సింగ్ హెూంలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో స్త్రీ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించటంతో పాటు కొన్ని స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. మహిళలందరూ ఈ క్యాంపులో విరివిగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపులో పరీక్షలు చేయించుకునే వారు 08592-233647 ఫోన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

ఎస్ఏఎంపి-1 పరీక్ష పేపర్లు

హైస్కూళ్లకి నేరుగా ఇవ్వాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్ఏఎంపి-1 పరీక్షా పత్రాలను ఉన్నత పాఠశాలలకు నేరుగా ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ నెల 18, 19, 20 తేదీలలో ఉన్నత పాఠశాలలో జరగబోయే పరీక్షలకు పేపర్లను ఉదయం, సాయంత్రం ప్రధానోపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌కి గంట ముందు తీసుకెళ్ళి పరీక్ష నిర్వహించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలను వారు ఖండించారు. పరీక్ష పేపర్లు లీకైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు 15 నుంచి 20 కిలోమీటర్లు దూరంలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అంత దూరం నుంచి పేపర్లు పట్టుకెళ్ళినప్పుడు భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. విద్యాశాఖ అధికారులే నేరుగా పాఠశాలకు పరీక్ష పేపర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. పదోతరగతి పబ్లిక్‌పరీక్షల మాదిరి ప్రశ్నాపత్రాలు తీసుకొని వెళ్లేటప్పుడు పోలీస్ రక్షణ కల్పించాలని వారు కోరారు.

అధిక పెన్షన్ రూ.9 వేలివ్వాలి

ఎపిఆర్‌పిఏ జిల్లా గౌరవాధ్యక్షులు ఏవి పుల్లారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హైయర్ పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆలిండియా పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏవి పుల్లారావు డిమాండ్ చేశారు. ఒంగోలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్.రాబిన్ రవి కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు, పెన్షనర్ల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఖండించారు. పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం రాబోయే రోజులలో పోరాటాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఆర్ఓ పేరయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు యూనియన్ ప్రధాన కార్యదర్శి రాంబాబు, యూనియన్ నాయకులు సుబ్బారావు, బివి రావు నర్సయ్య పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ

- రోడ్డుప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ
- నేరసమీక్షలో ఎస్‌పి దామోదర్ ఆదేశం


తాలూకా సిఐ అజయ్‌కుమార్, పొదిలి సిఐ టి.వెంకటేశ్వర్లుకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్‌పి ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. అసాంఘిక కార్యకమాలకు అడ్డుకట్ట వేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో మంగళవారం నేర సమీక్షా సమావేశమును నిర్వహించారు. సమావేశంలో ఎస్‌పి ప్రధానంగా పెండింగ్ గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, అట్రాసిటీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులు, మిస్సింగ్ కేసులు, ఇతర కేసులతో పాటు డిపిఓలో వివిధ పెండింగ్ రిప్లయ్స్‌పై సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీశారు. ఆయా కేసుల ఛేదింపుకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ల వారీగా యుటి కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. మహిళలు, చిన్నారుల అదశ్యం కేసులలో ఏ విధమైన అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాత్రిపూట గస్తీ పెంచి, డైనమిక్, బీట్స్, ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచాలని, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫోక్సో కేసులలో విచారణ తొందరగా పూర్తిచేసి, కోర్ట్ లో చార్జిషీట్‌లను నిర్ణీత సమయంలో దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణ కోసం ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్(ఐఆర్ఏడి) ద్వారా రోడ్డు ప్రమాద డేటాను విశ్లేషించి, ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో, పొగ మంచు పడే సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడంతో కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యలు, సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రతిభకు ప్రశంసలు

ఎస్‌సి, ఎస్‌టి, ఫోక్సో, మర్డర్ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయటం, లోక్‌అదాలత్‌లలో రాజీ మార్గంలో ఎక్కువ కేసులు డిస్పోసల్ అయ్యేలా చూడటంలో విశేష ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో అద నపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని రిలే దీక్షలు


దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో మేస్త్రీలుగా పనిచేస్తూ అధికారులు విధుల నుంచి తప్పించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలను సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి. రమేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మేస్త్రీల జోలికి ఏ ప్రభుత్వం వెళ్లలేదని, ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వారిని విధుల నుంచి తప్పించడం బాధాకరమన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు నోటి మాట ద్వారా కార్మికులను విధుల్లోకి రాకుండా ఆపడం దుర్మార్గమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరి ఇలాగే కొనసాగితే వివిధ కార్మిక, ప్రజా సంఘాలను కూడగట్టి ఐక్య ఉద్యమాన్ని రూపొందిస్తామని, ప్రజా ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. దీక్షలకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ జిల్లా కార్యదర్శి ఎండి యాసిన్ మద్దతు తెలిపారు. తమ యూనియన్ తరపున కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా మద్దతు తెలిపి.. మాట్లాడారు.

కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి టి.విజయ, కార్మికులు బి.భరత్, భూషణ్, గణేష్, శ్యామ్, రామకష్ణ, కష్ణ, అనిల్, గోపీచంద్, రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉంగరాల శ్రీను, రామకష్ణ పాల్గొన్నారు. దీక్షలో పాల్గొన్న కార్మికులకు కార్మిక నాయకులు నిమ్మరసం ఇచ్చి.. దీక్షను విరమింపజేశారు.

నీటి పంపిణీ సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం


చినగంజాం నుంచి అధ్యక్షునిగా ఎన్నికయిన పొద వీరయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో కృష్ణా, పశ్చిమ డెల్టా, నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు పరిధిలోని నీటిపంపిణీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అన్ని పదవులను టిడిపి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఈ నెల 14న జిల్లాలోని సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో పోటీ చెయ్యకూడదని వైసిపి నేతలు నిర్ణయం తీసుకోవడంతో ఈ ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. జిల్లాలోని 92 సాగునీటి సంఘాలకు అధ్యక్షులుగా ఎన్నికయిన వారు మంగళవారం జరిగిన ఎన్నికల్లో నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

కృష్ణా, పశ్చిమ డెల్టా పరిధిలో చీరాల నీటి పంపిణీ సంఘం అధ్యక్షునిగా స్వర్ణ గ్రామానికి చెందిన నీరుకట్టు పాండు రంగారావు, చిన్నగంజాం నుంచి గొనపూడికి చెందిన పొద వీరయ్య, బాపట్ల-1 నుంచి మల్లారపు శ్రీనివాసరావు, బాపట్ల-2 నుంచి ఇమ్మిడిశెట్టి మధుసూదనరావు, వేమూరు నుంచి డి.వెంకటసుబ్బారావు, కొల్లూరు నుంచి యలవర్తి కోటేశ్వరరావు, వెల్లటూరు నుంచి ఎర్రంశెట్టి వెంకట కరుణ శ్రీనివాసరావు, రేపల్లె నుంచి ఎర్రగల శ్రీనివాసరావు, మార్టోట నుంచి పి మురళీధరరావు, గోవాడ నుంచి ఎమ్.రాధాకృష్ణమూర్తి, కూచిపూడి సంఘం నుంచి కె.లీలా సత్యసాయి, పివిపాలెం నుంచి షేక్ ముంతాజ్ బేగం, జాగర్లమూడి నుంచి టి శివారెడ్డి, పొన్నూరు-3 నుంచి ఇనగంటి శ్రీకాంత్‌బాబు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

నాగార్జునసాగర్ కాలువ పరిధిలో నీటి పంపిణీ సంఘ అధ్యక్షునిగా కోనంకి నుంచి వి చక్రపాణి, ఇంకొల్లు నుంచి బండ్ల శ్రీనివాసరావు, ద్రోణాదుల నుంచి కొసరాజు దిలీప్, పర్చూరు సంఘ అధ్యక్షునిగా కొల్లా మురళీకృష్ణ, సంతమాగులూరు నుంచి కె శ్రీనివాసరావు, కొమ్మాలపాడు నుంచి కె యలమందయ్య, అద్దంకి నుంచి బి శ్రీనివాసరావు, జె పంగులూరు నుంచి కె.ఆంజనేయులు ఎన్నికయ్యారు.